24062025-MAI-04_Layout 1 6/24/2025 6:10 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# యుద్ధాగ్నికి అమెరికా ఆజ్యం

**అధికారంలోకి** వస్తే యుద్ధాలు ఆపుతానని హామీ ఇచ్చిన, భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని వల్లించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భీకర యుద్ధానికి తెరతీశారు. ఫొర్డో, ఇస్ఫాహాన్, నతాంజ్ అణుకేంద్రాలను భారీ బాంబులతో ధ్వంసం చేశారు. రాజీకి వచ్చేందుకు ఇరాన్‌కు రెండు వారాల సమయం ఇస్తున్నానని చెప్పిన రెండు రోజులకే యుద్ధం మొదలుపెట్టారు. పశ్చిమాసియాలో శాంతికి తద్వారా తీవ్ర విఘాతం కలిగించారు. ఇజ్రాయెల్ ద్వారా పరోక్ష యుద్ధాన్ని జరిపిన అమెరికా ఇప్పుడు ప్రత్యక్ష యుద్ధానికి తెగబడటం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసింది. యుద్ధంతో అమెరికాకు ప్రమేయం లేదంటూనే ఇజ్రాయెల్ తరపున తాఖీదులు జారీచేసిన ట్రంప్ ఇప్పుడు దాడికి తెగబడటం ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేస్తున్నది. అమెరికా సైనిక చర్య సుదూర, దీర్ఘకాలిక పర్యవసనాలు కలిగి ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

అమెరికా చర్యను ఇజ్రాయెల్ సహజంగానే ప్రశంసలతో ముంచెత్తగా, ఇరాన్ మాత్రం అగ్రరాజ్యం అతిపెద్ద ఎర్రగీతను దాటిందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే యుద్ధ ప్రభావం వల్ల పశ్చిమాసియా గగనతలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. తాజాగా సముద్ర మార్గాలూ సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేయాలని ఇరాన్ పార్లమెంట్ తీర్మానించడం ప్రపంచ వాణిజ్య రంగంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. 20 శాతం అంతర్జాతీయ చమురు రవాణా ఈ జలసంధి ద్వారానే జరుగుతుందని గుర్తుంచుకోవాలి. ఇరాన్ చర్య ప్రభావంతో చమురు ధరలు పెరిగే ప్రమాదం ఎదురవుతున్నది. అమెరికా సైనిక చర్యల వల్ల ఏదైనా అంతర్జాతీయ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిన దాఖలాలు ఇంతవరకైతే లేవు. అది అఫ్ఘానిస్థాన్ అయినా, ఇరాక్ అయినా ఫలితం ఒక్కటే. తాలిబన్ల పాలన అంతమొందించి ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పుతామనే బృహత్తర లక్ష్యంతో వెళ్లిన అమెరికా ఏమీ సాధించకుండానే వెనుదిరిగింది. ఇరాక్‌లో ఏ మేరకు అణ్వస్ర్తాలను అమెరికా కనిపెట్టగలిగిందో మనం చూశాం.

ఇప్పుడు ఇరాన్‌పై దాడి కూడా అణ్వస్త్రాల పేరిట జరిగినా, అసలు లక్ష్యం ఇజ్రాయెల్‌ను బలోపేతం చేయడం, పశ్చిమాసియాలో ఆయుధ పోటీని రెచ్చగొట్టడమే అమెరికా పరమావధి అనేది తెలిసిపోతూనే ఉంది. నిజానికి ఇరాన్ వద్ద అణుబాంబులు లేవని, వాటిని తయారు చేసే సామర్థ్యం కూడా ఇంకా రాలేదని అమెరికా గూఢచార విభాగం ఇస్తున్న సమాచారాన్ని ట్రంప్ తోసిరాజనడమే ఇందుకు తార్కాణం. పశ్చిమాసియాలో నమ్మినబంటు ఇజ్రాయెల్ కోసం అగ్రరాజ్యం ఎంతకైనా తెగిస్తుందని మరోసారి రుజువైంది. దేనిమీదా నిలకడ లేని ట్రంప్ దూకుడు వల్ల మరో ప్రపంచ యుద్ధ ప్రమాదం పొడసూపుతున్నది. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ అర్హుడని అమెరికా చిరకాల మిత్రదేశమైన పాకిస్థాన్ ప్రశంసించిన మరుసటిరోజే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో ఆయన ఆజ్యం పోయడం విడ్డూరం.

# అటు చతురత, ఇటు తడబాటు



టంకశాల అశోక్

**బనకచర్ల విషయమై జరుగుతున్న దానిని గమనించినప్పుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుది సమర్థమైన చాతుర్యం కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి అసమర్థపు తడబాట్లు అయినట్లు అర్థమవుతుంది. ముఖ్యమంత్రి స్థాయిలో గల ఒక నాయకునికి చాతుర్యం గాని, మరొక నాయకునికి తడబాట్లు గాని ఎందుకు వస్తాయి? ఇందుకు సాధారణంగా మూడు కారణాలుంటాయి. ఒకటి, తమ ముందున్న అంశంపై పూర్తి అవగాహన. రెండు, దాని పట్ల అవగాహనతో కూడిన నిబద్ధత. మూడు, కార్యనిర్వహణకు అవసరమైన సమర్థత. బనకచర్ల విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిలో ఈ మూడు కనిపిస్తుండగా, తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రిలో ఏ ఒక్కటీ కనిపించడం లేదు. అసమర్థత, తడబాట్లు తప్ప.**

ఈ మూడింటి గురించి మరికొంత చెప్పుకోవచ్చు. చెప్పుకోవడం అవసరమే కూడా. అప్పుడు గాని వారి గురించి మనకు తగిన అవగాహన కలగదు. దీనిని నాయకత్వ విశ్లేషణ అని అనవచ్చు. ముందుగా చంద్రబాబు గురించి చెప్పుకొందాం. బనకచర్ల చర్చతో సంబంధం గల నదీ జలాల విషయం ఆయనకు బాగా తెలుసు. అందుకొక సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆంధ్రాప్రాంతపు అభివృద్ధికి 19వ శతాబ్దం మధ్యలో ఆరంభం జరిగింది గోదావరి, కృష్ణా ప్రాజెక్టులతో. అప్పటి నుంచి కొద్ది దశాబ్దాలు గడిచేసరికి వ్యవసాయ రంగంలో మిగులు ఏర్పడి ఆ సంపదలతో వాణిజ్యం, పరిశ్రమలు తదితర రంగాల్లోకి విస్తరించారు. పొరుగు రాష్ట్రాల్లోనూ ఆర్థిక కార్యకలాపాలు సాగించారు. అప్పుడు బ్రిటిష్ పాలనలో ఉండినందున అంతర్జాతీయ వాణిజ్యమూ జరిగింది.

> మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి విడిపోయిన ప్పుడు చాణక్య రాజకీయంతో తెలంగాణను ఆక్రమించి, ఇక్కడి నీటితో ఇక్కడి పొలాలు తడపకుండా తమ భూములకు మళ్లించుకున్నారు. అదంతా జరుగుతుండగా, సరిగ్గా రేవంత్‌రెడ్డి అంశగల అప్పటి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఉష్ట్ర పక్షుల వలె ఇసుకలో తలలు దూర్చారు. వివిధ ప్రలోభాలకు లోనై కాంప్రడార్లుగా మారారు. విషయం ఏమంటే, చంద్రబాబుకు ఈ చరిత్ర బాగా తెలుసు.

ఈ విధమైన గత అవగాహనకు తోడుగా, తెలంగాణ ఉద్యమానికి గల బలమైన కారణాల్లో నీళ్లు ఒకటని, తెలంగాణ ఏర్పడిన తర్వాత వివిధ రూపాల్లో జల సమృద్ధి కలిగి వ్యవసాయ రంగం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందుతున్నదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం తలపెట్టిన పథకాలు పూర్తయితే తమకు అందనంత స్థాయికి చేరగలదనే అవగాహన కూడా చంద్రబాబుకు ఉంది. కనుక ఏదో ఒక చతురోపాయంతో, ప్రస్తుతం కేంద్రప్రభుత్వం నుంచి తమకు గల మద్దతును ఆసరా చేసుకొని, తమ కోసం వీలైనంత నీటిని ఇంకా తరలించుకుపోవాలి. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండి ఉంటే ఈ పథకం సాగేది కాదు గనుక, ఒకప్పటి కాంప్రడార్ల అంశగలవాడైన రేవంత్‌రెడ్డి ఇప్పుడు పాలిస్తున్నందున, తన పథకానికి ఇదే సువర్ణావకాశమవుతున్నది. పైగా, ఆయన గతంలో ప్రత్యక్షంగా, ఇప్పుడు పరోక్షంగా తన సహచరుడు. ప్రధాని మోదీ పార్టీ స్కూల్ వాడినని తానే చెప్పుకొంటూ, ఇప్పుడు కూడా ఆయన మాటను కాదనలేనివాడిగా కనిపిస్తున్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు చేస్తున్న మంచి చెడులేమిటో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఎప్పుడూ పట్టింపు లేదు. వారికి కావలసింది వేరే గనుక. పైన అనుకున్నట్లు, ఇది చంద్రబాబుకు గల అవగాహన. ఇందులో ఎంతటి తర్కం, ఎంత సమగ్రత ఉన్నదో కనిపిస్తున్నదే.

రెండవ కారణమైన నిబద్ధత విషయానికి వస్తే, ఎవరికి ఎందులోనైనా నిబద్ధత ఎందుకు కలుగుతుంది? తనకు, తన వర్గానికి, తమ ప్రాంతానికి, తమ ప్రజలకు గల ప్రయోజనాలు సదరు అంశంతో ముడిపడి ఉన్నట్లయితే. అది కూడా త్రికరణశుద్ధిగా అయితే. అప్పుడు వారు సవ్యంగానైనా, అపసవ్యంగానైనా తమ లక్ష్యాలను నెరవేర్చుకొనజూస్తారు. ఆయా అంశాలకు సంబంధించిన ప్రతి చిన్న పరిణామాన్ని వెయ్యి కళ్లతో గమనిస్తుంటారు. తగు చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తారు. న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాల విచక్షణతో పని ఉండదు. ఈ స్వభావం, వ్యవహారణాశైలి వారి వ్యక్తిత్వంలో భాగమవుతాయి. ఎన్ని ఎత్తులు వేసినా, తెలంగాణను కోల్పోయి కిందపడినా, ఓడిపోవడం మాత్రం నేటికీ జరగలేదని నమ్మే చంద్రబాబు, తమ ప్రయోజనాల పట్ల ఎంత నిబద్ధతను నేటికీ చూపుతున్నారో, తెలంగాణ ప్రయోజనాల పట్ల వ్యతిరేక నిబద్ధతను కూడా అంతే చూపుతున్నారు. ఆయన ఇన్నేళ్ల రికార్డును చూసిన తర్వాత, ఇప్పుడు బనకచర్ల చదరంగాన్నీ గమనిస్తున్నప్పుడు, ఇక ఆయన ఎన్నటికీ మారబోరని, ఒకటి మాట్లాడి మరొకటి చేసే కపటనీతిని వదలబోరని ప్రకటించేందుకు మనకు ఎటువంటి సందేహం అక్కరలేదు.

> ఆఖరున నిర్వహణాపరమైన సమర్థతకు వస్తే, చంద్రబాబుకు అన్ని విషయాల్లోనూ ఎంతటి సమర్థత ఉన్నదో మొదటినుంచి చూస్తూనే ఉన్నాం. మంచిచెడులన్నింటిలోనూ. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ వారు దుర్మార్గంగా పడగొట్టినప్పుడు జరిగిన ఉద్యమ నిర్వహణలో ఇతరుల తోడ్పాటుతో ఎంత సమర్థత చూపారో, తర్వాత అదే ఎన్టీఆర్‌ను అంతే దుర్మార్గంగా పడగొట్టి అధికారాన్ని చేజిక్కించుకోవడంలో అంతే సమర్థతను ప్రదర్శించారు.

ఆ తర్వాతి దుర్మార్గపు చర్యల జాబితా పెద్దదే గాని, ప్రస్తుత చర్చ బనకచర్ల సంబంధమైనది అయినందున అందులోకి పోనక్కరలేదు. ఇప్పుడు బనకచర్ల విషయమై అదే తరహాలో సమర్థత చూపజూస్తున్నారన్నదే గమనించవలసిన విషయం. గోదావరి, కృష్ణాల్లో నీటి లభ్యత, నీటివాటాలు, రెండు రాష్ట్రాల అవసరాలు, భవిష్యత్తు పరిస్థితి, దీని వల్ల తెలంగాణకు కలిగే లాభనష్టాలేమిటి, పరస్పర సంప్రదింపులు, అవేవీ లేకుండానే కేంద్రంలోని తమ మిత్ర ప్రభుత్వం ద్వారా పనులు సాగించుకునే మంత్రాంగాలు, నీటితోపాటు నిధులు రాబట్టజూడటం, నదుల అనుసంధానం ముసుగులో శకుని పాచికలు అన్నీ అనునిత్యం కనిపిస్తున్నవే. ఇవన్నీ అంతిమంగా నిర్వహణాపరమైన సామర్థ్యమే. కాకపోతే కుహకమైనది.

> మొదట పేర్కొన్న మూడు లక్షణాలు అటువైపు చంద్రబాబులో ఏ విధంగా ఉన్నాయో చూసిన తర్వాత, ఇటువైపు తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రికి ఎట్లున్నాయో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిద్దాం. ఉపోద్ఘాతం వలె ఒక్క మాటలో చెప్పాలంటే, బనకచర్లపై ఆయనలో మనం చూస్తున్న తడబాట్లకు కారణం విషయ అవగాహన, నిబద్ధత, కార్యనిర్వహణా సమర్థత మూడూ లేకపోవడమే. ఆయనకు ఇవి మౌలికంగా లేవని కాదు. వ్యక్తిగతంగా తనకు అవసరమైన వాటిలో బాగానే ఉన్నాయి.

అధికార రాజకీయాలు, గ్రూపు రాజకీయాలు, పదవుల సంపాదన, రియల్ ఎస్టేట్ (ఇది తను చెప్పినదే) వంటి వాటిలో. కానీ, ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఆ రాష్ట్రానికి అవసరమైన విషయాల్లో లేవు. బనకచర్ల అనే కాదు. ఆయన ముఖ్యమంత్రి అయిన ఏడాదిన్నరకాలంలో దేనినైనా చూడండి. ఏదో ఒక విధంగా అధికారం సంపాదించడం కోసం మొదట మంత్రాంగం నెరపి పీసీసీ అధ్యక్షుడయ్యారు. కానీ, పాజిటివ్ పద్ధతుల్లో పార్టీని నిర్మించిందేమీ లేదు. అసలు పార్టీని ఎట్లా నిర్మించాలనే అవగాహన, అందుకు అవసరమైన నిబద్ధత, కార్యనిర్వహణా సమర్థత ఆయనలో కనిపించలేదు. ఆ వెనుక, ముఖ్యమంత్రి కావాలనే వ్యక్తిగత 'చిరకాల స్వప్నాన్ని' నెరవేర్చుకునేందుకు నోటికి వచ్చిన అబద్ధపు హామీలన్నీ ఇచ్చి ఆ లక్ష్యాన్ని సాధించుకున్నారు. అంతేగానీ, ఆ హామీల అమలు గురించిన అవగాహన, అమలు చేయాలనే నిబద్ధత, చేయగల కార్యనిర్వహణా సమర్థతలను మొదటినుంచి ఇప్పటివరకు ఎన్నడూ చూపలేదు. జలవనరుల పథకాల నిర్మాణంలోనూ అదే కనిపిస్తున్నది.

ఇటువంటి పాజిటివ్ విషయాలకు బదులు రేవంత్‌రెడ్డి చూపుతున్న అవగాహన, నిబద్ధత, సమర్థత అంతా నెగెటివిజంలోనే. అబద్ధాలు, బుకాయింపులు, వాయిదాలు, మరిన్ని భ్రమల కల్పనలు, ఆరోపణలు, నిత్యం దుర్భాషలు, సొంత పార్టీలో, ప్రభుత్వంలో గ్రూపు రాజకీయాలు, ప్రత్యర్థులపై దొంగ కేసులు, పేదల అణచివేతలు, వారి ఇళ్లు కూలగొట్టడాలు, భూముల ఆక్రమణల వంటి వాటిలోనే. విశేషం ఏమంటే, ఇందుకు సంబంధించి కూడా చంద్రబాబుకు తనకు మధ్య వ్యత్యాసం స్పష్టంగా చూడవచ్చు. ఆయన తమకు కావలసినవి, ఇటువంటివి రెండూ చేస్తున్నారు. మనిషికి కొన్ని లక్షణాలు మౌలికం అయినప్పుడు అవి అన్నింటా ప్రతిఫలిస్తాయి. ఆ మౌలికత లేనప్పుడు రేవంత్‌రెడ్డి వంటి స్థాయి, స్వభావం, కేవలం స్వప్రయోజనాలు గల వారు ఆ లక్షణాలను వాటితో నిమిత్తం గల విషయాల్లో మాత్రమే నెగెటివ్‌గా చూపుతారు. రాష్ట్ర ప్రయోజనాలతో సంబంధం గల వాటిలో పాజిటివ్‌గా ప్రదర్శించలేరు.

బనకచర్ల అటువంటిదే. ఈ విషయమై ఇంత చర్చ జరుగుతుండగా తెలంగాణ ముఖ్యమంత్రి స్థానంలో గల వ్యక్తి అఖిలపక్ష సమావేశంలో అసలు ఆ ప్రదేశం ఎక్కడుంది, ఏ బేసిన్‌లో ఉందని అధికారులను ప్రశ్నించడం దిగ్భ్రాంతి కలిగించే మాట. అదే లేనప్పుడు అవగాహన, నిబద్ధత, కార్యనిర్వహణా సమర్థతలు ఎక్కడి నుంచి వస్తాయి? చంద్రబాబు చతురతను ఎట్లా ఎదుర్కొనగలరు? కేంద్రానికి ఆలస్యంగా మొక్కుబడి లేఖలు, ప్రతినిధివర్గాలు, ప్రతిపక్షాలపై యథాప్రకారం నిందలు, చంద్రబాబుతో చర్చలు అనడం వంటి రోజుకొక తడబాటు వల్ల తన వైఫల్యాలు దాగుతాయా? కేసీఆర్ ఆందోళనా మార్గం ప్రకటించడంతో కలవరపడితే రేవంత్ తడబాట్లు ప్రజలకు తెలియకపోతాయా? ప్రజలకు కేసీఆర్ అందువల్లనే తిరిగి గుర్తుకు వస్తున్నారు. చంద్రబాబు మెడలు వంచగలిగేది ఆయన మాత్రమే.






# ఇరాన్ సుప్రీం మూలాలు భారత్‌లో..

**ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయగా, ఇరాన్ కూడా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తున్నది. అమెరికా హెచ్చరికలు, దాడులను సైతం లెక్కచేయకుండా ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి పూర్వీకులకు భారత్‌తో సంబంధాలున్న విషయం వెలుగులోకి రావడం విశేషం.**

ఆయతుల్లా రుహోల్లా ఖొమేనీ పూర్వీకుల మూలాలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బారాబంకి జిల్లాలోని కింతూర్ గ్రామంలో ఉన్నాయి. ఖొమేనీ తాత సయ్యద్ అహ్మద్ ముసావి హిందీ 1800వ సంవత్సరంలో కింతూర్‌లో జన్మించారు. అంతకుముందు మొఘలుల కాలంలో ముసావి తండ్రి పర్షియా నుంచి భారత్‌కు వలస వచ్చారు. 1830లో అహ్మద్ ముసావి ఇరాక్‌లోని ఇమామ్ అలీ స్మారకాన్ని సందర్శించేందుకు నజాఫ్ నగరానికి వెళ్లారు. అయితే, ఆయన తీర్థయాత్ర కాస్త వలసగా మారిపోయింది. తన భారతీయ మూలాలను మరిచిపోకూడదని భావించిన ముసావి తన పేరు చివరన 'హిందీ'ని జతచేసుకున్నారు. ఇరాన్ అధికారిక రికార్డుల్లోనూ అదే పేరు కనిపిస్తుంది.

ముసావి హిందీ చివరికి ఇరాన్‌లోని మషాద్ నగరానికి చేరుకున్నారు. మషాద్‌కు వెళ్లడం ఇరాన్ మతాధికారుల వర్గాల్లో ఖొమేనీ కుటుంబం పరపతి పెరిగేందుకు బీజం వేసింది. అహ్మద్ హిందీ కుమారుల్లో ఒకరైన ముస్తఫాకు ఇరాన్ ఇదివరకటి సుప్రీం లీడర్ అయతుల్లా రుహోల్లా ఖొమేనీ జన్మించారు.

రుహోల్లాపై తన తాత అహ్మద్ హిందీ ప్రభావం ఎంతో ఉంది. మత సంప్రదాయాల విషయంలో రుహోల్లాకు ఆయనే ప్రేరణ. మహమ్మద్ రెజా షా పహ్లవి పాలనకు వ్యతిరేకంగా రుహోల్లా ఇరాన్ విప్లవాన్ని నడిపించారు. ఈ క్రమంలో 1979లో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌ను రుహోల్లా స్థాపించారు. ఆయతుల్లా రుహోల్లా ఖొమేనీకి ఇరాన్ చరిత్రలో ప్రత్యేక స్థానముంది. ఇప్పటికీ ఇరాన్ కరెన్సీపై ఆయన చిత్రాలున్నాయి. అయితే, ఆయన మూలాలు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్టు చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 1939లో మషాద్‌లో జన్మించారు. ఆయన తండ్రి సయ్యద్ జావద్ ఖమేనీ మత పండితుడు. ఆయన కూడా సయ్యద్ అహ్మద్ ముసావి హిందీ వంశానికి చెందినవాడే. మతపరమైన వాతావరణంలో విప్లవాత్మక ఆలోచనలతో ఖమేనీ పెరిగారు. తన భారతీయ మూలాల గురించి అలీ ఖమేనీ ఇప్పటివరకు చాలా అరుదుగా మాట్లాడటం గమనార్హం.

**- ఎడిటోరియల్ డెస్క్**

(మనీ కంట్రోల్ సౌజన్యంతో..)

# పాలకులకూ ఎఫ్‌ఆర్‌ఎస్ ఉండాలె



రావుల రాజేశం
77801 85674

**మారుతున్న కాలానుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిందే. ప్రభుత్వ యంత్రాంగం పనిభారాన్ని తగ్గించడం, పర్యవేక్షణ, పూర్తిస్థాయి కచ్చితత్వాన్ని అమలు చేయడం ఆహ్వానించదగినదే. అయితే ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిబద్ధత, వారి పనితీరును పర్యవేక్షించడానికి ఇప్పటికే అనేక ప్రామాణిక అంశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమలవుతున్న సాంకేతికతను, అందుబాటులో ఉన్న మెకానిజాన్ని కాదని, రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) వెనుక పడటం పలు అనుమానాలకు తావిస్తున్నది.**




రాష్ట్రంలో పర్యవేక్షణ అధికారుల కొరత ఎప్పటినుంచో ఉన్నది. అయితే, ఆ పోస్టులను భర్తీ చేసే చర్యలు ప్రభుత్వం చేపట్టడం లేదు. గత ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలను తీసుకొచ్చింది. వాటిలో హాజరు సరిగ్గా నమోదవుతూనే వచ్చింది. కానీ, సరిగ్గా ఎన్నికల ముందు ఆ వ్యవస్థ నిలిచిపోయింది. ప్రస్తుతం ఆ యంత్రాలన్నీ ఆయా పాఠశాలల్లోనే ఉన్నాయి. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల్లో ఎవరి ఫోన్ నుంచి వారే జీపీఎస్ ట్రాక్డ్ అప్లికేషన్ ద్వారా సెకండ్లు సహా విజయవంతంగా హాజరు నమోదు చేశారు. అదీ కాకుండా విద్యార్థుల కోసం నిర్దేశించిన డీఆర్‌ఎస్-ఎఫ్‌ఆర్‌ఎస్ అప్లికేషన్ ఎలాగూ ఉండనే ఉంది. అదీ కాకుండా అనేక గూగుల్ ఫార్మ్స్, లింకులు, గూగుల్ షీట్లు, జూమ్ మీటింగులు ఎవరు, ఎక్కడ ఉన్నారనే విషయాన్ని ఎరుక చేస్తూనే ఉన్నాయి. కాదు, కూడదంటే కాంప్లెక్స్ పెద్దలు, మండల విద్యాధికారులు, నోడల్, స్పెషల్ అధికారులు అన్ని పాఠశాలలను పర్యవేక్షిస్తూనే ఉన్నారు. కొన్ని జిల్లాలో ప్రార్థన సమయంలో జీపీఎస్ ట్రాక్ అయ్యేలా ఫొటో తీసి అధికారులకు పంపుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ప్రతినిధులు, గ్రామ పంచాయతీవారు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, పిల్లల తల్లిదండ్రులు.. ఇలా అనేక అనధికారిక పర్యవేక్షణలు జరుగుతూనే ఉన్నాయి.

> జీతభత్యాలు ఇవ్వడానికే చాలీచాలని బడ్జెట్‌లో అక్కరకురాని యంత్రాల కొనుగోలు ఎవరి కమీషన్ కోసం? కాపలా పెంచడం మంచిదే. ఇలా యంత్రాల కొనుగోలుకు బదులు, పర్యవేక్షణ యంత్రాంగాన్ని భర్తీ చేస్తే వ్యవస్థలో లోపాలు తగ్గుతాయి.

మనుషుల మీద నమ్మకం లేకపోతే, ప్రస్తుతం బూజుపట్టిపోయి బడుల్లో ముసుగేసిన బయోమెట్రిక్ మెషిన్లు, లేదా మొన్న ఉపాధ్యాయ శిక్షణకు వినియోగించిన జీపీఎస్ ట్రాక్డ్ మొబైల్ అప్లికేషన్ లేదా పిల్లల కోసం వాడే అప్లికేషన్‌ను నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. నిజంగా విద్యా నాణ్యత, ప్రభుత్వ పాఠశాలల మనుగడ మీద ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అన్ని రకాల పోస్టులను భర్తీ చేయాలి. విద్యా సంస్కరణలు చేసినట్టు ఊదరగొట్టిన ప్రభుత్వం.. ఉపాధ్యాయుల మీద ఒత్తిడి పెంచుతూ, నిందలకు గురిచేస్తూ ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుముఖం పట్టడం వెనుక విధానపరమైన లోపాలు ఉన్నాయనే వాస్తవాన్ని అంగీకరించకుండా ఉపాధ్యాయులను బలి చేయడం అత్యంత దారుణం. అందరితో సరైన విధానంలో పని చేయించాలని ప్రభుత్వం అనుకున్నట్టయితే, ఆ విధానం మంత్రులు, ముఖ్యమంత్రి నుంచే అమలు చేయాలి. వారి శరీరంలో ఒక చిప్ అమర్చి, వారి లైవ్ హాజరు అందరూ చూడగలిగేలా సంస్కరణలు తీసుకురావాలి. అనాలోచిత ప్రభుత్వ నిర్ణయాలను పాలకులకు వివరించి, అందులోని లోటుపాట్లను చెప్పవలసిన యంత్రాంగం తానతందాన అనడం విడ్డూరం.

అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఖర్చులు తగ్గించుకోవడం, ఆదా చేయడం గురించి సీఎం మాట్లాడుతున్నారు. కొత్తగా కాన్వాయ్ కొనలేదని, ప్రగతి భవన్ తనకు వద్దని ఊదరగొట్టారు. అయితే, ఇప్పుడు అనేక మార్గాలు ఉన్నప్పటికీ ఎఫ్‌ఆర్‌ఎస్ యంత్రాల కొనుగోలుకు తెరతీయడంపై ఆరోపణలు వస్తున్నాయి. సీఎం చిత్తశుద్ధిని నిరూపించుకునే సమయం ఆసన్నమైంది. ఈ యంత్రాల కొనుగోల్‌మాల్‌ను సత్వరమే ఆపి, అందుబాటులో ఉన్న బెస్ట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. పిల్లల విద్యాబుద్ధులు, సౌకర్యాలు, నిధులు, నియామకాల మీద అడ్డగోలుగా నియమాలను అతిక్రమిస్తున్న ప్రైవేటు, కార్పొరేటు సెక్టార్ మీద కొరడా ఝుళిపిస్తే అప్పుడు ఆయన ముఖ్యమంత్రి అనిపించుకుంటారు.

(వ్యాసకర్త: సోషల్ వర్కర్, జర్నలిస్ట్)






# 'అన్నా' స్థానంలో అమిత్ షా!

**ఏఐఏడీఎంకే నాయకుడు పళనిస్వామి తమ పార్టీ పేరులో ఇంకా అన్నా, ద్రవిడం అనే పదాలు ఉన్నాయనే విషయాన్ని మరిచిపోయారు. వారి పార్టీ జెండాలో కనిపిస్తున్న వ్యక్తి అన్నాదురై అనే సంగతి అయినా ఆయనకు గుర్తుందా? కొంపదీసి ఆయన 'అన్నా' స్థానంలో 'అమిత్ షా'ను చేర్చారా?**


- రఘుపతి, తమిళనాడు మంత్రి

# ఓ తెలంగాణోడా మేలుకో..

*ఓ తెలంగాణోడా నీకే చెప్పేది.. విను! నీకు తెలవకుండానే, నిన్ను మల్ల బానిసని చేస్తున్నది ఈ రాజ్యం. ఈ రాజ్యం నువ్వు అనుకున్న ఇందిరమ్మ రాజ్యం కాదు, కమ్మనైన పచ్చ రాజ్యం. తెలుగుదేశపోడు నడిపిస్తున్న రాక్షస రాజ్యమే. బెల్లి లలితక్కని బలి తీసుకున్న బాబు నడిపిస్తున్న రాజ్యమే. మందిమాటలను పట్టుకొని పచ్చగున్న తెలంగాణని మల్లా ఆంధ్రా పెత్తందార్ల చేతుల్లో పెట్టే దుస్థితి వచ్చింది.*

ఓ తెలంగాణోడా నీకు తెలుసా? 'కత్తి ఆంధ్రోడిదే కానీ, పొడిచేది మాత్రం తెలంగాణోడ'ని ఉత్తగ చెప్పలే కేసీఆర్ నాడు. మన నీళ్లు, నిధులు, నియామకాలు అన్ని ఇక వాడు చెప్పినట్టే నడుస్తాయి. మంది మాటలు నమ్మి మారు వానం పోతే ఉన్న ఇల్లు కాలిందట. గట్ల మంది మాటలు నమ్మి దొంగ మీడియాగాళ్ల సోషల్ మీడియా ఫేక్ న్యూస్‌లను నమ్మి తినే పళ్లెంలో మన్నువోసుకున్న ఓ తెలంగాణోడా మల్ల బానిస బతుకు బతకడానికి సిద్ధమైపో. ఓ రైతన్నా.. ధైర్యంగా మల్లా కొట్లాటకు నాగలి పట్టుకొని తయారై ఉండు. లేకుంటే మనకు ఉరితాడే శరణ్యం. ఓ నేతన్న నీ సాలె మగ్గంని పక్కకు పెట్టుకు, మంది మాటలు నమ్మి మోసపోయింది చాలు. తెగించి కొట్లాడు ఇకనైనా.. ఓ బేస్త, ముదిరాజ్ సోదరులారా.. మీ చేపలు ఇక అమ్ముడుపోనీయకుండా 'ఆంధ్రా పిత్తబర్గెలే ముద్దు' అంటే నీ వలనే వారికి ఉరిగా మలుచు. ఆంధ్రావోడు మన వనరులు, సంపద మీద రాజ్యమేలడానికి తెలంగాణోడే సాయం చేసుడు షురూ జేసిండు. ఎవడు మనోడు, ఎవడు పరాయోడో తెలువక గాయి గత్తర అయితిరి, మాటలు నమ్మితిరి. మనం గోసలు పడటానికి మన కత్తితో మన కంట్లనే పొడుసుకునేలా చేసిండ్రు.

ఓ తెలంగాణోడా ఇకనైనా అర్థమైందా? కాకపోతే మనల్ని మన ముందు తరాలు క్షమించవు. వద్దన్న బానిస బతుకులను మల్లా తెచ్చుకున్న తెలంగాణోడా విను.. ఇంటోడు మనోడు కాకపోతే పడే అవస్థలు అన్నీఇన్నీ కావే రాములా.. చివరగా కాళోజీయాదిలో ఒక మాట.. 'తెలంగాణని నాడు మోసం చేసింది పరాయోడే.. నేడు, రేపు మోసం చేసేది పరాయోడే. మన తెలంగాణోడి చేతిలో కత్తి పెట్టి మనల్నే పొడిపిస్తరు. అందుకే, ప్రాంతేతరులకు వత్తాసు పలుకుతున్నవారిని మన తెలంగాణ పొలిమేరల దాకా తరిమికొడుదాం. మనల్ని మోసం చేస్తున్న మన ప్రాంతంవాడిని ఇక్కడే పాతరవేద్దాం. మన భావితరాలకు ప్రశాంత జీవితాల కోసం పాటుపడదాం. ప్రజా ఉద్యమం చేసి పెత్తందార్ల లెక్క చేసే నాయకుల పొగరు అణచుదాం. మేలుకో తెలంగాణోడా.. ఇకనైనా మేలుకో.



సల్వాజి మాధవరావ్
93916 73807